క్లుప్తంగా

ఎంపీడీఓకు సత్కారం



ఎంపీడీఓను సత్కరిస్తున్న సిబ్బంది

సిద్దవటం: గాలివీడు మండలానికి బదిలీ అయిన సిద్దవటం ఎంపీడీఓ జవహర్ బాబును ఉపాధి హామీ ఏపీఓ నరసింహులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ జవహర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ అనేది తప్పనిసరి అని, ప్రజాప్రతినిధులు, సర్పంచులు తనకు సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా



వాహన రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ సుధాకర్

చిన్నమండెం : రికార్డులు సక్రమంగా చూపని వాహనదారులకు చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ శుక్రవారంజరిమానా విధించారు. మల్లూరు క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేశారు. రికార్డులు లేకుండా ప్రయాణం చేయవద్దని ఎస్ఐ సూచించారు.

దళితులకు భూములు పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పండుగోల మణి

పుల్లంపేట : పుల్లంపేట మండలంలో గిరిపుత్రులు, దళితులకు భూములు పంపిణీ చేయాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి తెలిపారు. పుల్లంపేట బైపాస్ రోడ్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుల్లంపేటలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయరామయ్య, వెలుగు లక్ష్మయ్య, కృష్ణవేణి, చిన్నక్క, శ్రీనివాసులు, ఎల్లమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఏఈగా సుబ్రహ్మణ్యం



రైల్వేకోడూరు అర్బన్ : రైల్వే కోడూరు పట్టణ విద్యుత్తు శాఖ ఏఈగా సూర్ల సుబ్రహ్మణ్యం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పులివెందుల మండలం సింహాద్రిపురం నుంచి బదిలీపై ఆయన రైల్వే కోడూరుకు వచ్చారు.

తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజంపేట నుంచి ఆమె ఇక్కడికి బదిలీ అయ్యారు.

ఏపీఎంగా బాధ్యతల స్వీకరణ



సిద్దవటం : మండల ఏపీఎంగా ఎం.సుజాత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న వెంకటేశ్వర్లు చెన్నూరు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చింతకొమ్మదిన్నె మండలంలో పనిచేస్తున్న సుజాతను సిద్దవటం మండలానికి నియమించారు. శుక్రవారం బాధ్యతలు తీసుకున్న ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విధి నిర్వహణలో సమయ పాలన పాటించాలని ఆమె కోరారు.

ప్రభుత్వ కళాశాలలో స్వాగతోత్సవం



బహుమతులు అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి ఆకాంక్షించారు. రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్వాగతోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదవాలన్నారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న రఘురామయ్య

వీరబల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న రఘురామయ్యకు యోగివేమన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కృష్ణారెడ్డి శుక్రవారం ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు అందజేశారు. రఘురామయ్య విద్యార్థులతో కలిసి గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఉన్నప్పుడు విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచారు. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం అత్యుత్తమ సేవా పురస్కారాన్ని అందజేసింది.

రహదారిపై ప్రయాణం.. నరకప్రాయం

- దారి పొడవునా గుంతలు, మలుపులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు

ముంబై–చెన్నై 716 నెంబర్ గల జాతీయ రహదారిపై రోడ్డు ప్రయాణం నరకమై పోయింది. మనిషి హూనమైపోతున్నాడు. బైక్ మొదలు కారు వరకూ ఏ వాహనం వెళ్లినా ఇబ్బందులు తప్పడం లేదు. భారీ గుంతలు, ఆపై మలుపులు యమపురిని తలపిస్తున్నాయి. వాహన దారులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు.

ఓబులవారిపల్లె : ముంబై–చెన్నై 716 నెంబర్ జాతీయ రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు అర్థిస్తున్నా.. ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. పాలకులు, అధికారులు ఈ రోడ్డు మార్గం గుండా ప్రయాణిస్తున్నా.. పెరిగిన రవాణా అవసరాలకు తగ్గట్టుగా రహదారిని బాగు చేయడంలేదు. దారిలో చాలా చోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. తెలుగు రాష్ట్రాల నుంచే గాక మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి తిరుమలకు వెళ్లే భక్తుల వాహనాలు నిత్యం వందల సంఖ్యలో ఈ మార్గంలోనే వెళ్తుంటాయి. రహదారిపై వాహనం దగ్గరకు వచ్చేంత వరకూ గోతులు కనిపించడం లేదు. ఆదమరిచి వాహనాలు నడిపితే ఖచ్చితంగా ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి కలుగుతోంది. 2004, జూలై 4వ తేదీన చిన్న ఓరంపాడు సమీపంలోని దాబా హోటల్ వద్ద సుమోను లారీ ఢీకొనడంతో ఆర్.వెంకటేష్, వై.సుబ్బరాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఇక కింద పడి గాయాలైన వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది.



చిన్నఓరంపాడు వద్ద భారీ గుంత



ముక్కావారిపల్లిలో స్పీడ్ బ్రేకర్ వద్ద గోతులు

రాత్రిళ్లు పెరిగిన ప్రమాదాలు

నిత్యం ఉద్యోగులు, వ్యాపారులు ద్విచక్ర వాహనాలపై కడప–తిరుపతి జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో గోతులు కనిపించక ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఈ రహదారిపై ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణాలు చేయాల్సిందేనంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ మార్గంలో వెళ్తున్నా.. రహదారి మరమ్మతులపై దృష్టి పెట్టడం లేదు. ప్రస్తుతం కురిసే వర్షాలకు గుంతల్లో నీరు చేరి రోడ్డు ఇంకా ప్రమాదంగా మారింది. ప్రజలు ప్రాణాలు కోల్పోయి క్షతగాత్రులు కాకముందే గోతులైనా పూడ్చాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆగస్టు 14వ తేదీన అనంత రాజంపేట క్రాస్ రోడ్డు వద్ద స్కూటర్‌ను లారీ ఢీకొడంతో మండలానికి చెందిన బత్తల సిద్దేశ్వర్ పులగంటి వెంకటసుబ్బయ్య అక్కడికక్కడే మృతిచెందారు.

గోతులతో ప్రమాదం



జాతీయ రహదారిలో బైక్‌పై వెళ్తుంటే ప్రమాదాలు జరుగుతున్నాయి. దగ్గరికి వచ్చేంత వరకు గోతులు కనిపించకపోవడంతో వేగం అదుపు చేయలేక కింద పడే పరిస్థితి. ఇప్పటికే ఈ మార్గంలో చాలామంది ప్రమాదాలతో గాయాలపాలయ్యారు. అధికారులు, నాయకులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– సయ్యద్ సలీంపీరా, ఓబులవారిపల్లె

అధికారులు పట్టించుకోవడం లేదు



చాలా రోజుల నుంచి జాతీయ రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. తరచూ ఈ మార్గంలో అధికారులు తిరుగుతున్నారు. నాయకులు కానీ పట్టించుకోవడం లేదు. గోతులు పూడ్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గుంతల్లో నీరు చేరి ఇంకా ప్రమాదకరంగా మారుతోంది.

– గోపీనాథ్‌రెడ్డి, ఓబులవారిపల్లె

ఉచిత ఇసుక హామీ వెంటనే అమలుచేయాలి



నిరసన ప్రదర్శిస్తున్న నిర్మాణ రంగ కార్మికులు

రాయచోటి అర్బన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని వెంటనే అమలుచేయాలని సీపీఎం రాయచోటి రూరల్ మండల శాఖ కార్యదర్శి మాధవ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో సీపీఎం కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు. సీపీఎం కార్యదర్శి మాధవయ్య మాట్లాడుతూ ఉచిత ఇసుక హామీ మరచి పేదల సొంతింటి కల నిర్వీర్యం చేశారన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించి పేర్ల నమోదు ప్రక్రియను కొనసాగించాలన్నారు. ఓబులమ్మ, సావిత్రి, సుధాకర్, వెంకటేష్, శ్రావణి, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

శ్మశానానికి హద్దుల గుర్తింపు



దళితుల శ్మశానానికి హద్దులు గుర్తిస్తున్న అధికారులు

సుండుపల్లె: సుండుపల్లె పంచాయతీ దిగువ గుళ్లావాండ్లపల్లి వాసులు వినియోగిస్తున్న శ్మశాన స్థలానికి రెవెన్యూ అధికారులు శుక్రవారం హద్దులు చూపారు. రెండు రోజుల కిందట రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కొందరు ఆ స్థలం ఆక్రమించి రోడ్డు నిర్మించేందుకు యత్నిస్తున్నారని దళితులు ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దారుకు వినతి పత్రం ఇవ్వడంతో ఆయన స్పందించి సర్వేయర్, రెవెన్యూ అధికారులతో కలిసి కొలతలు వేయించి హద్దులు గుర్తించారు.

ఓటమి ఎరుగని ప్రజానాయకుడు మిథున్‌రెడ్డి



మాట్లాడుతున్న పాపినేని విశ్వనాథరెడ్డి

రాజంపేట టౌన్ : ఓటమి ఎరుగని ప్రజానాయకుడు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెదేపా నాయకులు ఎంపీని మున్సిపల్ కార్యాలయానికి రాకుండా అడ్డుకున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెదేపా నాయకులు నీచ రాజకీయాలు మానుకుని, హుందాగా ఉండాలని హితవు పలికారు. జేసీబీ శివారెడ్డి, జీవీ.సుబ్బరాజు, దాసరి పెంచలయ్య, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధే మన ధ్యేయం

సంబేపల్లె : మండల అభివృద్ధే మన ధ్యేయం అని మండలాధ్యక్షురాలు నాగ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సభా భవన్‌లో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. దుద్యాల వద్ద కొండకింద హరిజనవాడలో నీటిఎద్దడిని పరిష్కరించాలని మండల ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ అధికారులకు విన్నవించారు. గుట్టపల్లె సమీపంలోని జగనన్న కాలనీని ఆక్రమిస్తున్నారని సర్పంచి చిదంబరరెడ్డి తహసీల్దారు వెంకటేశ్వర్లుకు తెలిపారు. సచివాలయ సముదాయాలను పరిశుభ్రంగా ఉండేందుకు అటెండర్‌ను నియమించాలని సభ్యులు కోరారు. శెట్టిపల్లె పంచాయతీలో ఈ క్రాప్ నమోదులో అక్రమాలు జరిగాయని, వెంటనే రికార్డులు పరిశీలించాలని జడ్పీటీసీ కవితా రమేశ్‌రెడ్డి అధికారులను కోరారు. ప్రకాస్ నగర్ కాలనీ సమీపంలోని జెడ్‌పీసీ భూముకు పాసు పుస్తకాలు రాలేదని సర్పంచ్ మోహన్ తహసీల్దారుకు తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు వారి ప్రగతి నివేదిక చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేశ్‌కుమార్, రవీంద్రనాయుడు, సర్పంచులు, ఎంపిటీసీ, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలను వింటున్న ఎంపీపీ నాగ శ్రీలక్ష్మి

నేడు సమాచార కమిషనర్ రాక

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామ స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ శనివారం రానున్నట్లు కడప ఐఅండ్‌పీఆర్ కార్యాలయ అధికారులు తెలిపారు.

పిడుగు పాటుతో ఆవు మృతి

గాలివీడు: అరవీడు గ్రామం శ్రీనగర్ కాలనీకి చెందిన లక్ష్మీ దేవికి చెందిన ఆవు పిడుగుపాటుతో మృతిచెందడంతో పశువైద్యుడు డాక్టర్ టి.భాస్కర్ పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించాలని లక్ష్మీదేవి కోరారు.

పెనగలూరు ఎంపీడీఓగా విజయారావు



విజయారావు



సుజాతమ్మ



సోమశేఖర్



వరప్రసాద్

పెనగలూరు : పెనగలూరు ఎంపీడీఓగా విజయారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఓబులవారిపల్లెలో పనిచేస్తూ బదిలీపై ఆయన పెనగలూరుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ వరప్రసాద్ రాజంపేట ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు.

ఎంపీడీఓగా సుజాతమ్మ

నందలూరు : మండల ఎంపీడీఓగా జె సుజాతమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అట్లూరు మండలం నుంచి బదిలీపై నందలూరు మండలానికి ఆమెను నియమించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ సౌభాగ్యమ్మ తిరుపతి జిల్లా ఏర్పేడుకు బదిలీపై వెళ్లారు.

ఒంటిమిట్టకు సోమశేఖర్

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండల నూతన ఎంపీడీఓగా సోమశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చక్రాయపేట ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఒంటిమిట్టకు విచ్చేశారు. ఎంపీడీఓ సోమశేఖర్‌ను కార్యాలయ సిబ్బంది పూలమాలలు, శాలువాతో సత్కరించారు.

బాధ్యతల స్వీకరణ

రాజంపేట టౌన్ : రాజంపేట ఎంపీడీఓగా పగడాల వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయితీల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి నివారణకు ఇప్పటి నుంచే ప్రణాళిక తయారు చేసుకోనున్నట్లు తెలిపారు.

6న చలో రాయచోటి

రాయచోటి అర్బన్ : ఈ నెల 6వ తేదీన హలో మాల.. చలో రాయచోటి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య తెలిపారు. స్థానిక మాల మహానాడు నేతలతో కలిసి మున్సిపల్ పరిధిలోని పొదలపల్లె మాలపల్లె, అబ్బవరం మాలపల్లెల్లో ఆయన పర్యటించారు. చలో రాయచోటి కార్యక్రమ గోడ పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6న పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం నుంచి ఆర్టీసీ బస్టాండు సర్కిల్ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం ఎన్‌జీఓ సభా భవనంలో సమావేశం నిర్వహిస్తున్నామని, ప్రతి పల్లె నుంచి ప్రజలు, మాల ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నేతలు రవిశంకర్, చంద్రశేఖర్, రవి, శ్రీకాంత్, రమణయ్య, చిన్న రాయుడు, రెడ్డిబాబు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న మాలమహానాడు నేతలు

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు

సిద్దవటం : కడపకు చెందిన కొందరు మాధవరం, ఉప్పరపల్లె, తదితర గ్రామాల నుంచి సేకరించిన బియ్యం లారీలో తరలిస్తుండగా సిద్దవటం మండలం మాధవరం–1 గ్రామ శివారున పోలీసులు పట్టుకున్నారు. 50 బస్తాల బియ్యం ఉన్నట్లు వారు తెలిపారు.

సనాతన ధర్మం గురించి పవన్ మాట్లాడడం తగదు

డీసీసీ అధ్యక్షుడు గాజులభాస్కర్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్

రాయచోటి అర్బన్ : సనాతన ధర్మం గురించి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడడం విచిత్రంగా ఉందని అన్నమయ్య జిల్లా డీసీసీ అధ్యక్షుడు గాజులభాస్కర్ అన్నారు. పట్టణ డీసీసీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం అంటే ఏమిటో పవన్ కల్యాణ్ పూర్తిస్థాయిలో తెలుసుకుని మాట్లాడాలన్నారు. వారాహి దీక్షలో చెప్పులు ధరించి కనిపించిన ఆయన.. కలియుగ దైవం వేకటేశ్వరుడి చిత్రపటాన్ని చెప్పులు ధరించే తీసుకున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇవ్వడంపై శ్రద్ధ చూపాలని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మన్సూర్ అలీఖాన్, ఖదీర్, అమీర్, దర్బార్, యహియా, చెన్నక్రిష్ణ పాల్గొన్నారు.

జగన్మాతా.. నమోస్తుతే



రైల్వేకోడూరు అర్బన్: జగన్మోహినిగా.. కన్యకాపరమేశ్వరి



రాజంపేట టౌన్: బ్రహ్మచారిణి అలంకారంలో ఎల్లమ్మ



సిద్దవటం: బంగారుపేటలో అన్నపూర్ణాదేవి అలంకరణ



రాయచోటి టౌన్: అన్నపూర్ణ దేవీగా కన్యకాపరమేశ్వరి



సిద్దవటం: గాయత్రీ దేవి అలంకరణలో విజయదుర్గ




రాయచోటి టౌన్: భవానీ అలంకరణ



రాయచోటి టౌన్: చౌడేశ్వరీ దేవికి అలంకరణ



రామాపురం: నీలకంఠ్రావుపేటలో మహాలక్ష్మి దేవిగా



లక్కిరెడ్డిపల్లి: గాయత్రీదేవి అలంకరణలో



రామాపురం: దర్బారు సాయినగర్‌లో భవానీ దేవిగా



రాయచోటి టౌన్ : అన్నపూర్ణగా కన్యకాంబ



పుల్లంపేట: గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు



రాయచోటి టౌన్: కామాక్షి రూపంలో భద్రకాళీ



గాలివీడు: బాలత్రిపురసుందరీ దేవిగా అమ్మవారు



సుండుపల్లె: గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు



పార్వతీదేవి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి



రాజంపేట టౌన్ : ఊరేగింపులో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి వైభవం

రాజంపేట టౌన్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజంపేట పట్టణంలోని వివిధ ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కరుణించు తల్లీ జగన్మాతా...మా ఇలవేల్పు నీవేనమ్మా... అంటూ భక్తులు ప్రణమిల్లారు. పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీకన్యకాపరమేశ్వరీదేవిని బిల్వవృక్షనీదేవిగా అలంకరించారు. ఉత్సవ మూర్తిని ఆలయం గర్భగుడి చుట్టూ ఊరేగించారు. చౌడేశ్వరీదేవి ఆలయంలో వీరచౌడేశ్వరీదేవిని కామాక్షీ దేవిగా, మన్నూరులోని ఎల్లమ్మ ఆలయంలో బ్రహ్మచారిణిగా అలంకరించారు.

రాయచోటి టౌన్ : రాయచోటిలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారిని కామాక్షి దేవిగా అలంకరించారు. కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా అలంకరించారు. పాత రాయచోటి అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి.. గాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెక్‌పోస్టు వద్ద ఉమామహేశ్వరీదేవి అమ్మవారిని భవానీరూపంలో అలంకరించారు. కొత్తపేటలో చౌడేశ్వరీదేవి అమ్మవారిని భవానీ రూపంలో అలంకరించారు.

రామాపురం: నీలకంఠ్రావుపేటలో వాసవీకన్యాకపరమేశ్వరి దేవిని అర్చకులు మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. మహిళలు సహస్ర నామార్చన చేశారు.

రామాపురం : దర్బారుసాయి నగర్ అనంతాశ్రమంలో కొలువైన సద్గురు దర్గా మాతాజీని పండితులు భవానీ దేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చిన్నమండెం : మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని శుక్రవారం భవానీదేవిగా అలంకరించారు.

సుండుపల్లె : సుండుపల్లెలోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు.

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి విశ్వభారతి స్కూల్ సమీపంలో వెలసిన సర్వమంగళాదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి పూజలు జరిపారు.

గాలివీడు: పూజారివారిపల్లిలో ఇరుగులమ్మవారిని బాలా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని పార్వతీ దేవిగా అలంకరించారు. సాయంత్రం మహిళలు సహస్ర నామ కుంకుమార్చన జరిపారు.

సిద్దవటం : మండలంలోని బంగారుపేట శివారున గల గంగా భవానీ ఆలయంలో అమ్మవారిని శుక్రవారం రెండవ అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిద్దవటం : మండలంలోని సాయి నగర్ గ్రామంలో విజయదుర్గాదేవి అమ్మవారిని గాయత్రీదేవిగా శుక్రవారం అలంకరించారు. నిర్వాహకులు పుత్తా బాబు సహస్ర నామార్చన, దేవీ ఖడ్గమాల, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వే కోడూరు కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో అమ్మవారిని జగన్మోహినిగా అలంకరించారు. ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, మహన్యాస రుద్రాభిషేకం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పుల్లంపేట : పుల్లంపేట మెయిన్ రోడ్డులో వెలసిన మారమ్మతల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపి గాయత్రీదేవిగా అలంకరించారు. శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరమణల కుటుంబసభ్యులు పూజలు జరిపారు.